
Bapu

## వల దీపావళి కథల పోటీలో మూడవ బహుమతి పొందినది

కొొవ్వు కాసే ఆశ ఉండి కూడా ఎండి పోయి చీడపట్టిన ముసలిదానిలా మామిడిచెట్టు ఓ పక్కకి వంగింది. అక్కడక్కడ దాని కున్న ఆకులు ఎప్పుడు రాలిపోదామా అన్నట్టు గాలికి రెప రెప లాడుతున్నాయి. ఆ కాస్త గాలికే వణికి పోతూంది జానకి.

"మళ్ళా ఎటాక్ వచ్చిందా?" పక్క మంచం మీద పడుకున్న అతను లేచాడు.

"కొంచెం ఆయాసంగా ఉంది. ఆ కిటికీ రెక్క వేసెయ్యండి."

లేచి కిటికీ తలుపు వేసేశాడు.

జానకి ఇంకా ఆయాసపడుతూనే ఉంది.

ఆమె గుండె గడియారంతో పోటీ పడుతూంది.

ఆమె శ్వాస ఆ గదిలో ప్రతిధ్వని స్తూంది.

"టాబ్లెట్ తీసుకురానా?" సమాధానం కోసం చూడకుండా పక్క గదిలోకి వెళ్ళాడు.

జానకి కళ్ళు మూసుకుంది.

"ఇదుగో, వేసుకో ..."

జానకి నెమ్మదిగా లేచి, టాబ్లెట్ వేసుకుంది. మంచినీళ్ళ గ్లాసు అందు

### మల్లంపల్లి కాశీ విశ్వనాథ ప్రసాదు

కుంటూ ఒకసారి ఆ వ్యక్తి వంక చూసింది.

"ఏమవుతాను మీకు?"

"ముందర నీళ్ళు తాగు."

నెమ్మదిగా నీళ్ళు తాగేసి గ్లాను ఇచ్చింది. జీరో వాట్ బల్బు కాంతిలో ఆమె కాళ్ళ వంక ఒకసారి చూసుకుంది.

"కొంచెం లైట్ వెయ్యండి."

"ఎందుకూ?"

"కాళ్ళు వాచినట్టు కనిపిస్తున్నాయి."

అతను స్విచ్ నొక్కాడు. పాలు పార బోసినట్టు అయింది. నెమ్మదిగా మంచం దగ్గిరకి వచ్చి చీర మోకాళ్ళ వరకు జరిపి చూశాడు.

"నీరు పట్టింది కదూ?" జానకి నెమ్మదిగా అడిగింది.

"అవును. కొంచెంగా. రేపొద్దున్న డాక్టర్ నాయర్ దగ్గిరకి పోదాం ... పడుకో."

స్విచ్ తీసేసి తన మంచం మీద పడుకుని తదేకంగా చూశాడు జానకిని.


'ఎలా ఉండేది జానకి? ... కనీసం ఇంత జబ్బు ఉంచుకుని కూడా బయటకు చెప్పలేదు ... ఎలా దిగమింగిందో ఆ బాధని.'

జానకి కళ్ళు తెరిచింది.

"ఏమి టలా చూస్తున్నారు?"

"అబ్బే ... ఏం లేదు." పక్కకు తిరిగి కళ్ళు మూసుకున్నాడు.

'తనకోసం తాగుడు, జర్దా, సిగరెట్– అన్నీ వదిలేశారు, కాని, ఏముంది తనలో? ఏమవుతారు తనకి? ఎక్కడో దూరపు చుట్టరికం. మొదట్లో మాట్లాడేందుకే భయపడేది తను. ఇప్పుడు ఆయన ఇంట్లో ఉంటూంది. ట్రీట్‌మెంటుకోసమని వచ్చింది. తండ్రి తనకి ఎలాగూ పెద్ద వైద్యం చేయించ లేదు. అలా గని తను చచ్చిపోదామనే అనుకుంది మొదట. కాని, ఈయన వచ్చి వైద్యం చేయిస్తా నన్నప్పుడు తనకి ప్రాణం లేచివచ్చినట్లు అయింది. తండ్రి



తనకూ — ఈయనకూ వయస్సు, బంధుత్వం ఆలోచించి అభ్యంతరం పెట్టలేదు. అలా అని వయసు కోర్కెలు ఆగుతాయా? ఎలా నెగ్గుతామా అని ఆలోచిస్తాయి. చివరకు అవే నెగ్గాయి. కాని, అది కూడా ఒక్కసారే గెలిచాయి. తను కలయికని సంఘం ఒప్పుకోదు. ఆయనకి ఇద్దరు పిల్లలు, భార్య. అందర్నీ వదిలి తనని తెచ్చుకున్నారు. తనకీ సంఘంలో ఏ విధంగా స్థానం వస్తుంది? ...'

"ఇంకా పడుకోలేదా?"

"ఇప్పుడే కొంచెం నిద్ర పడుతూంది."

కళ్ళు మూసుకుంది జానకి.

'తన భార్య తనని ఎన్ని మాట లంది? అంత అహంకారికి ఇదే తగిన శాస్తి. కాని, తనని నమ్ముకుని వచ్చిన జానకికి ద్రోహం చెయ్యలేదు. పదిహేను ఏళ్ళ వయస్సు తేడా. అయితేనేం? తను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఈ ప్రేమ ముందు వదిలేసిన పదిహేను ఎకరాలు, మేడ... ఏవీ తన దృష్టికి రావటం లేదు. కష్టపడి సంపాదించుకున్న ఉద్యోగం తాలూకు తనకి వచ్చే జీతం, ఈ జీవితం చాలు. రేపొద్దున్న జానకిని డాక్టర్ నాయర్‌కి చూపించాలి. తరవాత లాయర్‌ని కలవాలి, డైవర్స్‌కి నోటీసిమ్మని చెప్పాలి.

అప్రయత్నంగా అతని కళ్ళు మూతలు పడ్డాయి.

"కొంచెం నెమ్మదిగా వాయించమన రాదూ వాళ్ళని."

"ఊరుకోవేమే వాళ్ళు అంత గట్టిగా వాయిస్తేనే, దేవతలకి వినిపిస్తాయి."

పక్కన స్నేహితురాలు కిసుక్కున నవ్వింది.

ఊపిరి పీల్చుకోకుండా వాద్యాలు మోగుతున్నాయి.

"తీసుకురండి." పెద్ద కేక వినిపించింది.

ఎవరో మోసుకుని వెళ్ళారు.

ఆయన లేచి మెడలో మంగళ సూత్రం కట్టబోతున్నారు. ఒక్కసారి కళ్ళు తెరిచి చూసింది.

మంగళ వాద్యాలు ఒక్కసారిగా గట్టిగా మోగడం మొదలుపెట్టాయి.

మసకగా కనిపిస్తున్నాడు తన తండ్రి.

"అబ్బ, కాస్సేపు ఆపమనండి."

గట్టిగా అరిచింది జానకి.

బాధగా కళ్ళు తెరిచి చూసింది.

తన చెయ్యి చేతుల్లోకి తీసుకొని చూస్తున్నాడు అతను.

"ఏమిటి, జానకీ, ఏమయింది?"

జానకి మోచేతుల మీద లేచి చుట్టూరా చూసింది. వీపు కింద దిండు సరిచేసి కూర్చోపెట్టాడు.

"చూడు, ఎంత చెమట పట్టిందో? ఆగు, కొంచెం ఫాన్ వేస్తాను."

లేచి ఫాన్ స్విచ్ నొక్కాడు.

చల్లగాలి గది అంతా నిండింది.

"ఏమిటి, జానకీ? అంత గట్టిగా అరిచావు."

"ఏమని అరిచానండీ?"

"కాస్సేపు ఆపమనండి అన్నావు. ఏదైనా పీడ కల వచ్చిందా?"

"అబ్బే ... మంచి కలే వచ్చింది... చాలా మంచి కల...ఎవరో డిస్టర్బ్ చేస్తుంటే..."

"భలేదానివే, కొంచెం కాఫీ తెస్తాను."

"అర్ధరాత్రి శ్రమ ఎందుకండీ?"

"అర్ధరాత్రా ... తెల్లారి ఎనిమిదయింది. నీకు చలిగాలి తగులుతుందని కిటికీ రెక్కలు తియ్యలేదు."

జానకి గడియారం వంక చూసింది.

"అయితే, నన్ను లేవనివ్వండి... కాలు నొప్పి కూడా కొంచెం తగ్గినట్టు ఉంది."

"మొహం కడుక్కుని రా? నే నీలోపల కాఫీ తెస్తాను."

• • •

"ఏమన్నారు ... డాక్టర్ ... ఎక్స్-రే కూడా తీశారు."

"మళ్ళీ రేపొద్దున్న రమ్మన్నారు."

"హలో, ఏమిటి, మీ రిటు వచ్చారు?"

పొడుగ్గా తెల్లటి బట్టల్లో టక్ చేసుకుని హుందాగా వచ్చాడు ఓ వ్యక్తి.

"ఓ... హరిగారా? మీకూ గుండె జబ్బేనా?"

"మీకూ అంటే ముందర మీకు ఉందన్న మాట... ఏం, సార్, ఏమిటి విషయం?"


"నీ బొంద ... అలాంటిది ఏం లేదు కాని ... కొంచెం ఇంటి వరకు దిగబెట్టరా! నాకు కొంచెం పనుంది."

"సరే, ఏం చేస్తాం ... ఆ వ్యక్తితో చెప్పి వస్తాను."

హడావిడిగా వెళ్ళిపోయాడు హరి.

"మీరు తొందరగా వస్తారు కదూ?"

"తొందరగా వచ్చేస్తాను. రేపటి వరకు ఈ మందులు వాడమన్నారు. ఇవి తీసుకుని వచ్చేస్తాను."




"ఆఫీసుకు ..."

"సెలవు పెట్టి వస్తాను."

"మరి కూరలు ..."

"ఎక్కువ మాట్లాడకు, జానకీ. మళ్ళీ ఆయాసం వస్తుంది."

ఓసారి దీర్ఘంగా చూసి ఊరుకుంది.

హరి వచ్చాడు.

"రండి, జానకిగారూ, వెళదాం."

"టాక్సీ మీద వెళ్ళండి."

జేబులోనుంచి పది రూపాయల నోటు తీశాడు.

"తీసుకో."

మాట్లాడకుండా తీసుకున్నాడు హరి.

జానకి నెమ్మదిగా లేచి వెళ్ళింది.

టాక్సీ ఎక్కేంతవరకూ చూసి నెమ్మదిగా నడిచాడు.

• • •

"డాక్టర్ నాయర్ నా జేబు బాగా వదిలించినట్టున్నారు." ఇరవై రోజుల తరవాత జానకి నవ్వుతూ అంది.

"ఏం?"

"ఇరవై రోజుల్లో మామూలు మనిషి అయ్యాను కదా?"

"అదా? రికమెండేషన్ ప్రభావం."

తల వెనక్కి వాల్చి భారంగా కళ్ళు మూసుకున్నాడు.

"ఏం... అలాగున్నారు? ఒంట్లో ఎలా ఉంది?" దగ్గరగా వచ్చి నుదుటి మీద చెయ్యి వేసి అడిగింది.

"ఆఫీసులో పని కొంచెం ఒత్తిడిగా ఉంది." కుడిచేత్తో చెయ్యి పట్టుకుని తీసేశాడు. కాని, చెయ్యి వదల్లేదు.

"అరే ... మరిచిపోయాను, నాన్న వచ్చారు. ఊళ్ళోకి వెళ్ళారు."

"ఏమిటట కబుర్లు?"

"ఏ మున్నాయి ... అమ్మకి బెంగగా ఉందట, చెల్లాయిలు పదే పదే అడుగుతున్నారట."

"ఒకసారి వెళ్ళి వస్తావా?"

"మిమ్మల్ని ఒంటరిగా వదిలి?"

అతను చాలా బాధగా చూశాడు.

జానకి చెయ్యి విడిపించుకుని లేచి వంట గదిలోకి వెళ్ళింది.

"ఏమండీ?" జానకి తండ్రి వస్తూ అడిగాడు.

"రండి ... రండి ... కులాసానా అంతా?"

"ఆఁ ... ఒకసారి జానకిని ఇంటికి తీసుకెళతాను. ఇప్పుడు బాగా ఆరోగ్యంగా ఉంది కదా? ..."

"నాదేముంది ... అమ్మాయి ఇష్టం."

విడితే జరగవు."

"సర్లెండి ... ముందర ఈ విషయం చెప్పండి. మీ ఆవిడ, పిల్లల సంగతి ఏం చేశారు?"

"ఇంకా ఏమీ చెయ్యలేదు ... ఏం చెయ్యమంటావు."

జానకి తల వంచుకుంది.

అతను మాట్లాడకుండా లేచి గది లోకి వెళ్ళి తన మంచం మీద పడుకున్నాడు.

జానకి లైట్లార్పి, తలుపు మేసవచ్చింది. తన మంచం మీద కూర్చుని అతని వంక చూసింది. వెల్లకిలా పడుకుని రెండు చేతులూ గుండెల మీద పెట్టుకుని పైకి చూస్తున్నాడు.

అతని గుండె మండుతూంది.

కడుపులో దేవితోసి దేవుతున్నట్లు ఉంది.

డాక్టర్ నాయర్ చాలా పెద్ద పేరు చెప్పాడు— "లెఫ్ట్ వెంట్రికల్ ఫెయిల్యూర్" అని. ప్రస్తుతానికి తగ్గి బాగానే ఉన్నట్టు కనిపించినా, తిరిగి ఎప్పుడో ఒకప్పుడు తిరగబెట్ట వచ్చునట.

తను ఎంత ఆశపడ్డాడు!

తను కావలనుకున్న భార్యకు ఒక లోకం చూపుదా మనుకున్నాడు. కాని, జరిగిం దేమిటి? పక్కకి తిరిగి జానకి వంక చూశాడు.

పాప పుణ్యాలు తెలియని జాబిల్లి బొమ్మలా ఉంది జానకి.

ఈ పరిస్థితుల్లో జానకిని వదిలే యడమా? తన మనస్సు అంగీకరించటం లేదు.

మెల్లిగా కళ్ళు మూసుకున్నాడు.

రెండు రోజుల తరవాత హరి వచ్చాడు హడావిడిగా.

"ఏమండోయ్, జానకిగారూ! నాకు పెళ్ళి చేసేస్తున్నారు."

"హమ్మయ్య. నాకు శ్రమ తప్పింది. కొంచెం కాఫీ తెస్తాను."

"ఆగండి ... అప్పుడేనా! పిల్లని చూసి రావాలి. అప్పుడు మీకు శ్రమ తప్పుతుంది ... ఇంకా అవీ ... ఇవీ మాట్లాడుకోవాలి."

"కట్నం తీసుకోకుండా చేసుకో రాదూ!"

"రాదు ... ఎందుకంటే నేను అడగట్లేదు. లేని నాన్న అడగడు. ఉన్న అమ్మ అడగదు... కాని, చూశారా ... అసలు తప్పంతా మిమ్మల్ని కన్న తండ్రులదండి."

"అదేమిటి? మా నాన్నగా రేం చేశారు మధ్యన?"

"ఆ నోటితో కాఫీ ఇవ్వండి ... ఆప్ కోర్సు ఆడపిల్లల తండ్రులు అనుకోండి, వాళ్ళే ముందరి రహస్యంగా ఇంత ఇస్తాం, అంత ఇస్తాం అంటారు. మాదేముంది? ఏదో రహస్యంగా ఇస్తామంటున్నారుగదా అని ఊఁ అనేస్తాము కాని, మేమమాత్రం తీసుకోము."

"స్తోత్రాలు చెబుతున్నారా?"

"లేదండి. ఒ సారి ముందుకు ఆలోచించుకుంటే ... నా కో కూతురు ఉన్న దనుకోండి. కట్నం ఇవ్వలేను. అప్పుడు నాకు ఎవరైనా నా కూతుర్ని కట్నం లేకుండా చేసుకుంటే బాగుండును అనిపిస్తుంది. కాని, ఇప్పుడు నేను కట్నం తీసుకున్నా ననుకోండి— అప్పుడు నేనూ బాధపడక తప్పదు. ఇదో రకమైన సెంటిమెంటు ..."

"సర్లెండి—ఆ అమ్మాయి అదృష్టవంతురాలు ... ఎప్పుడు వెళుతున్నారు?"

"అబ్బే, అదో పల్లెటూరండి... పెళ్ళిళ్ళ పేరయ్యగారు వస్తే నాలుగు ముక్కలు నేను విని, మిగతా ముక్కలు అమ్మను వినమని నేను ఇటు వచ్చేశాను."

"అయితే, పెళ్ళి భోజనం పెట్టిస్తున్నారన్న మాట."

"ముందర మీరే పెట్టించాలి... తరవాత నేను."

జానకి ముఖం ఎర్రబడింది.

"నే వస్తాను ... వచ్చానని చెప్పండి." కాఫీ కప్పు కింద పెట్టి వెళ్ళాడు.

జానకి దిగులుగా కళ్ళు మూసుకుంది.

"మళ్ళీ కల కంటున్నావా?"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

ఎదురుగా కుర్చీలో కూర్చున్నా డతను.

"ఎంతసే పయింది?"

"ఇప్పుడే."

జానకి లేచి వంట గదిలోకి వెళ్ళి కాఫీ కలుపుతూ, హరి విశేషాలు చెప్ప సాగింది.

"మిమ్మల్నీ విషయం అడుగుతా రట."

"ఏమిటట?"

"మీరు భోజనం ఎప్పుడు పెడతా రని?"

దిగులుగా నవ్వా డతను.

మరో నాలుగు రోజుల తరవాత హరి వచ్చాడు.

"ఎంతవరకూ వచ్చిందండి మీ పెళ్ళి ప్రోగ్రెస్."

"చాలా దగ్గరకి ... అది సరే ... ఏమిటి? మళ్ళీ మీరు చిక్కినట్టు కనిపిస్తున్నారు."

"అబ్బే, ఏం లేదే ... కొంచెం ఆయాసం వస్తూంది."

"తగ్గిపోతుంది లెండి ... మా పేరయ్యగారు ఈవేళ వచ్చారు. మూడవ తేదీ పెళ్ళిచూపులు. ఈ ఊళ్ళోనే తీసుకు వచ్చి చూపిస్తారు కాబట్టి మీరు మూడవ తేదీ కల్లా రెడీగా ఉండాలి."

"నేను రానండీ."

"అమ్మ గట్టిగా రమ్మనమని చెప్పమంది. అదీకాక మీరు రాకపోతే పిల్లని వవరు చూస్తారు?"

"పిల్ల ఏమిటండి?"

"ప్రస్తుతం పిల్ల కదా!"

జానకి నవ్వుకుంటూ లేచి వెళ్ళింది.

అతను నవ్వాడు. హరి విష్ చేసి మెల్లిగా అడిగాడు:

"ఎంతవరకూ వచ్చింది?"

"రేపే నాయిదా!"

"తేలిపోతుందా?"

"ఊఁ."

• • •

"ఆనమవండి ..."

అతను విసురుగా లేచాడు మంచం మీద నించి. లైట్ వేసి జానకి వంక చూశాడు.

సముద్రపు కెరటంలా ఆయాసం వస్తూంది.

ముక్కుపుటాలు అదురుతున్నాయి. నుదురు అంతా చిరుచెమటలు పోసాయి.

అతను కంగారుగా వెళ్ళి టాబ్లెట్లు తీసుకుని వచ్చాడు. జానకిని లేపి తన భుజానికి ఆనించుకొని, టాబ్లెట్లు బలవంతంగా వేసి నీళ్ళు తాగించాడు.

జానకి కళ్ళు తెరిచి చూసింది.

ఆ కళ్ళలో ఆనందం ఉంది.

"నాకు నెప్పిగావుతూంది ..."

"మాట్లాడకు ... జానకీ" అన్నాడు పడుకోబెట్టి.

అరగంట గడిచింది.

జానకిలో మార్పేమీ కనిపించలేదు. బట్టలు వేసుకుని టాక్సీ తెచ్చాడు. రెండు చేతులతోను ఎత్తుకున్నాడు. ఒక సారి గట్టిగా తన గుండెకి అదుము కున్నాడు.

అతని కంట్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కాని, అతని మండే గుండెలో పడి అవి ఆవిరి అయిపోతున్నాయి. టాక్సీలో జానకిని పడుకోబెట్టి తలుపు తాళం వేశాడు. దారిలో హరి ఇంటికి వెళ్ళి హరిని లేపి, హాస్పిటల్‌కి తీసుకుని వచ్చాడు.

జానకిని డాక్టర్ నాయర్‌కి అప్పచెప్పి, కళ్ళు మూసుకుని పక్క బెంచీ మీద కూర్చున్నాడు.

పావుగంట గడిచింది.

నర్సు వచ్చి చెప్పింది, డాక్టర్ పిలుస్తున్నారని. వదిలిన బాణంలా వెళ్ళారిద్దరూ,

మెత్తని మనసుగలవారికి పోటలో వేడి పుడుతుంది... పాషాణ హృదయులు రాపిడిలో అగ్ని కురిపిస్తారు.

—జానియస్

జీవితంలో విజయం సాధించడం ప్రధానం కాదు. సంఘర్షణే జీవితానికి బలం.

—హెంటా కెంబార్స్

**వ్యక్తి సమాజం**

సమాజం యజమాని. మనిషి దాని సేవకుడు. మంచి సమాజంలో మంచి సేవకులు. చెడు సమాజంలో చెడు సేవకులు తయారవుతున్నారు. సమాజాన్ని బట్టి వ్యక్తి మంచి చెడులు నిర్ణయించవచ్చు.

—సా

---

"అయామ్ వెరి సారీ! ... ఆక్సిజన్ పెట్టి కూడా ..."

అతను మాట్లాడలేదు.

జానకి ఉన్న గదిలోకి వెళ్ళాడు.

మహా సముద్రం మధ్య ఉన్న ప్రశాంతతలా ఉంది జానకి మొహం.

అతని గుండె పిండి అయిపో తున్నది.

బయటికి వచ్చేశాడు.

హరికి మనసులో ఉద్వేగం ఆగుతూ లేదు. [illegible]

అతను హరికి ఏదో చెప్పి వెళ్ళి పోయాడు.

• • •

గదిలో గడియారం తొమ్మిదికొట్టింది.

హరి హడావిడిగా తిరుగుతున్నాడు. వాద్యగాళ్ళు శ్రుతి చేసుకుంటున్నారు.

అతనుమాత్రం గది మధ్యలో నిశ్చింతంగా పడుకుని ఉన్న జానకి దగ్గరగా కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

"ఇదేమిటీ, హరీ, ఇక్కడున్నావు?"

"పేరయ్యగారా? మీ రిక్కడికి వచ్చా రేమిటి? ఆయ నెవరు?" హరి అడుగుతున్నాడు.

"ఈయనేనయ్యా, నీకు పిల్లనిచ్చే ఆయన— వాళ్ళఅమ్మాయి జానకి ఇక్కడే బంధువుల ఇంట్లో ఉంటూంది. కొంప తీసి పెళ్ళికూతురు నీకు తెలుసేమిటి?"

వింటున్న అతను బాధగా కళ్ళు తెరిచాడు. ★